ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 | సంచిక : 12 | ఆగష్టు 2019

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

22-01-1984
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-01-1984, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

తన బుర్రలో ఉన్నదంతా ఎదుటివాడికి అంటగట్టడానికి చూస్తాడు మనిషి. మనిషిలోని బలహీనత అది. తనలో ఉన్నది ఎదుటి వాళ్ళకి కూడా అంటగట్టేద్దాం అని చూస్తాడు. తను మనిషి కాబట్టి విష్ణువు కూడా తనలాగే ఉంటాడేమో అనుకుంటాడు. మన గుణాలని బట్టి మనకు అర్థం అవ్వటంకోసం ఆయన కూడా మనిషికింద రావలసి వస్తోంది. విష్ణువు అంటే ఒక వ్యక్తి కాదు వ్యాపించినవాడు అని అర్థం. విష్ణువు వ్యాపించాడు అంటే ఆయన కాళ్ళూ, చేతులూ, పొట్టా వ్యాపించాయా? కాదు. అంతటా వ్యాపించి ఉన్నది ఆత్మే. ఈ లోకంలో కానీ, పరలోకంలో కానీ అంతటా వ్యాపించి ఏముంది, ఆత్మే! అంటే విష్ణువుని ఆరాధించేటప్పుడు కూడా మీకు తెలియకుండా మీరు ఆత్మని తెలుసుకోవటానికే ప్రయత్నిస్తున్నారు.

ఉపదేశసారంలో భగవాన్ ఒక మాట చెప్పారు -

**హృత్ స్థలే మనః స్వస్థతా క్రియా। భక్తి యోగ బోధాశ్చ నిశ్చితం।**

మన హృదయస్థలంలో కనుక మనస్సుని లోపల నిలబెట్టి ఉంచగలిగితే అదే భక్తి, అదే జ్ఞానం, అదే కర్మ, అదే యోగం. మీలో ఎవరైనా హృదయస్థలంలో మనస్సుని అరికట్టి ఉంచగలిగితే వాడు గొప్ప కర్మ చేస్తున్నట్టే లెక్క. బయటివాళ్ళకి అనిపించవచ్చు వాడు సోమరిపోతు అని, కానీ వాడు ఎంత కర్మ చేస్తున్నాడో వాళ్ళకి తెలియదు. అది స్థూలబుద్ధి, వాళ్ళని కూడా మనం ఏమీ అనకూడదు. స్థూలబుద్ధి అడ్డుపడుతుంది.

భగవద్గీతలో ఏం చెప్పారంటే, హృదయస్థలంలో కనుక మనస్సుని అరికట్టి ఉంచగలిగితే, మోక్షానికి అది ఒక్కటే చాలు అని చెప్పాడు. మాటలతో సరిపెట్టకూడదు. హృదయస్థలం ఎలా ఉంటుందో, అది మీకు అనుభవానికి వచ్చినప్పుడు ఆ సుఖం, శాంతి, ఆనందం, కాంతి తెలుస్తూ ఉంటాయి.

వేదవాక్యం "అహం బ్రహ్మాస్మి" అంటే అర్థం నేను బ్రహ్మ స్వరూపము అని. నేను అంటే ఏమిటి? అనేక వికారాలతోటి, రాగద్వేషాలు, కామక్రోధాలు, హెచ్చుతగ్గులు తోటి కూడుకున్న నేను బ్రహ్మమా? అహం అంటే నేను. నేను అంటే మనస్సు బ్రహ్మమా లేకపోతే అహంకారం బ్రహ్మమా? మనం నేను నేను అంటున్నాము కదా? అన్నింటికంటే ఎక్కువ ఉపయోగించేది అదే. నేను అనే మాట లెక్కపెట్టండి రోజూ ఉదయం మొదలు సాయంత్రం వరకూ ఎన్నిసార్లు అంటారో. మరి ఇన్నిసార్లు మీ నోటిలో నలిగిపోతోంది కదా ఈ నేను. మరి ఈ నేను అంటే ఏమిటో తెలుసుకోవటానికి మీరెవరూ ప్రయత్నం చేయరా? దేవుడు ఉన్నాడు అని చెప్పేవాడు అదే అంటాడు. దేవుడు లేడు అని చెప్పేవాడు అదే అంటాడు. దేవుడు లేడు అని చెప్పేవాడికి ఇదే పని. ఈ నేనుని వాడు విడిచిపెట్టడు. పైగా ఈ నేను అంటే మనకంటే వాడికి ఎక్కువ ఇష్టం. భక్తుడికంటే భక్తి లేనివాడికి మరీ ఎక్కువ ఇష్టం నేను అంటే.

ఈ నేనుని మనం ఎంతకాలం అయితే విడిచిపెట్టమో, అంతకాలం దేహాన్ని మోయవలసిందే. ఈ దేశాన్ని విడిచిపెట్టి ఇంకో దేశం వెళ్ళటం ఎటువంటిదో, ఈ దేహాన్ని విడిచిపెట్టి ఇంకో దేహంలోకి వెళ్ళటం అటువంటిదే. అహంబ్రహ్మాస్మి అంటే నేను బ్రహ్మ స్వరూపము అని. ఆ నేను రాగద్వేషాలతో కూడుకున్న పరిమితమైనటువంటి, మనస్సుకి సంబంధించినటువంటి నేను కాదు. మన లోపల ఉన్న ఆత్మ బ్రహ్మస్వరూపం. అంటే నువ్వు ఎవరవు. ఆత్మ స్వరూపం. నీకు తెలియక అహంకార స్వరూపుడను అనుకొంటున్నావు. మీరు అనుకొనే నేను మట్టుకు బ్రహ్మస్వరూపం కాదు. అది తెలుసుకోండి. పుస్తకాలు చదవటం వల్ల ఇదే ప్రమాదం. పుస్తకాలలో నేను బ్రహ్మస్వరూపం అని ఉంటుంది. ఇక్కడ నేను అంటే మీరు అనుకొనే నేను కాదు. మీ లోపల హృదయంలో ప్రకాశిస్తున్నటువంటి ఆత్మస్వరూపం. ఆ నేను బ్రహ్మస్వరూపం. అంతేకానీ మీరు అనుకొనే నేనుకి ఆ బ్రహ్మస్వరూపానికి ఎట్టి సంబంధమూ లేదు. కొంచెము కూడా అణుమాత్రము కూడా సంబంధంలేదు. ఈ దేహం పుట్టినప్పుడు కానీ, ఈ దేహం పెరిగినప్పుడుకానీ, ఈ దేహం స్మశానంలో కాలి బూడిద అయినప్పుడుకానీఆత్మలో మార్పు ఉండదు. కానీ మీలో ఈ

దేహముతో ఎట్టి సంబంధమూ లేనటువంటి నేను ఉంది. మీ ఇంద్రియాలతో కానీ, మీ దేహంతో కానీ, మీ మనస్సుతో కానీ, మీ బుద్ధితో కానీ, దేనితోటి సంబంధం లేని నేను ఉంది. అది స్వయంప్రకాశం. దానికి లైటు అక్కరలేదు, సూర్యుడు అక్కరలేదు. మనం ఏదైనా ఒక వస్తువుని చూడాలంటే పగలేమో సూర్యుడు ఉండాలి, రాత్రి అయితే దీపం ఉండాలి. అయితే ఆ స్వరూపం మనకి అనుభవంలోనికి వచ్చినప్పుడు, అది మనకి కనిపించటం కోసం, సూర్యుడి సహాయం అక్కరలేదు. వెలుగు సహాయం అక్కరలేదు. ఆ నేను మీరు అనుకొనే నేను కాదు. ఆ నేనుకి మీ దేహానికి కొంచెము కూడా, కించిత్తు కూడా సంబంధంలేదు. దానికి దీనికి ఏమీ సంబంధంలేదు.

సర్వసాధారణంగా టీనేజ్ అంటే పదమూడవ సంవత్సరం మొదలు పందొమ్మిదవ సంవత్సరం వరకూ - దానిని టీనేజ్ అంటారు. ఆ వయస్సులో వాళ్ళకి తెలియదు మనం చెపితే అర్థం కాదు. ఆ వయస్సులో కనుక మనిషి బుద్ధిమంతుడు అయితే, ఇంక వాడి జీవితం పొడుగునా వంద ఏళ్ళు బ్రతికినా వాడిని చూడక్కరలేదు. ఆ వయస్సులో శరీరం ఎదుగుతూ ఉంటుంది, మనస్సు ఎదుగుతూ ఉంటుంది. అప్పుడు కనుక మనస్సు బ్యాలెన్సుగా ఉంటే ఇంక ఏమీ ఫరవాలేదు. ఈ ఏజ్ సరిగ్గా మొగ్గ పువ్వు అవుతున్న వయస్సు. మనస్సులో కొత్త భావాలు వస్తూ ఉంటాయి. అపుడు కనుక వాడికి మనోనిగ్రహం ఉంటే, సరిగ్గా విషయాన్ని అర్థం చేసుకునే బుద్ధి కనుక ఉంటే, ఇంక వంద ఏళ్ళు బ్రతికినా మనం వాడిని చూడక్కరలేదు. ఇంక వాడి గురించి మనం ఆలోచించక్కరలేదు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఆ వయస్సులో చాలా జాగ్రత్తగా ఉండాలి. కొంత వయస్సు వచ్చిన తరువాత పిల్లలని కూడా పిల్లలుగా చూడకూడదు. స్నేహితులుగా చూసుకోవడం నేర్చుకోవాలి. మనం సలహా చెప్పేటప్పుడు స్నేహితులుగానే చెప్పాలి. మనం వాళ్ళకి సలహా చెపుతున్నాము అనే భావం కూడా వాళ్ళకి కలగకుండా చెపితే వాళ్ళ అహంకారం దెబ్బతినదు.

ఒక ఉపనిషత్తులో, ఋషి ఏమని చెప్పాడంటే ప్రపంచం అంతా నాదే అనుకో, లేకపోతే ప్రపంచంలో ఏదీ నాది కాదు అనుకో. మనకి రెండూ చేతకాదు. ప్రపంచం అంతా నాది అనుకో, లేకపోతే ప్రపంచంలో ఏ వస్తువూ నాది కాదు అనుకో. ప్రపంచంలో ఏ వస్తువూ నాది కాదు అనుకోవటం జ్ఞానమార్గం. ప్రపంచం అంతా నాది అనుకోవటం కర్మమార్గం. కర్మయోగి ప్రపంచం అంతా తనదే అనుకొంటాడు. మీ అనుభవంలో చూడండి ఉదాహరణకి - ఈ ప్రపంచం అంతా నాది అనుకోగలమా, అనుకోలేము. పోనీ ప్రపంచంలో ఏ వస్తువూ మనది కాదు అనుకోగలమా. అలాగా అనుకోలేకపోతున్నాము. అంటే ఆ

మార్గానికి అనుకూలంగా లేము. ఈ మార్గానికి అనుకూలంగా లేము.

డాక్టర్ ఆపరేషన్ చేసేటప్పుడు, కత్తులు అన్నీ బాగా ఉడకపెడతాడు, బాగా ఉడక బెట్టిన తరువాత అప్పుడు ఆపరేషన్ చేస్తాడు. ఆ కత్తులు ఉడకబెట్టకుండా కనుక ఆపరేషన్ చేస్తే సెప్టిక్ అయిపోతుంది. ఆపరేషన్ చేసాక కుట్ల దగ్గర చీము పట్టడం, ఇలా అనేక చెడ్డలు వచ్చేస్తాయి. అందుచేత వేడినీళ్లలో కత్తులు ఉడకబెడతారు. ఉడక బెట్టిన తురువాత ఆపరేషన్ చేస్తే ఇంక దోషం ఉండదు. అదేవిధంగా మన ఇంద్రియాలని, మన మనస్సుని, మన శరీరాన్ని ఉడకబెట్టాలి. వేడినీళ్లలో ఎలాగైతే కత్తులు ఉడకబెడతారో, అలాగే మన ఇంద్రియాలని, మన మనస్సుని, మనశరీరాన్ని జపంలో, ధ్యానంలో, సాధనలో ఉడకబెట్టాలి. కత్తులను ఉడకబెట్టిన తరువాత ఉపయోగించుకుంటే, ఆ కత్తుల వల్ల దోషం ఎలా ఉండదో, అలాగే మన తెలివిని, మన అనుభవాన్ని, మన శక్తిని, మన ఇంద్రియాలని ఉడకబెట్టిన తరువాత మనం ఉపయోగించుకుంటే, వాటివల్ల మనకి దోషం ఉండదు.

మీకు ఏది ఇష్టమో మీ హృదయంలో ఒకసారి చూసుకోండి, మీకందరికీ ఏదో ఇష్టం ఉంటుంది. పైకి చెప్పొద్దు. మీ హృదయంలో ఏది ఇష్టమో మీరు ఆలోచించుకోండి. మిమ్మల్ని ఎవరినీ పైకి చెప్పమనటం లేదు. ఏదో ప్రీతి మీ హృదయంలో ఉండి ఉంటుంది. ప్రీతి లేకుండా మీరు ఉండరు. మీకు ఎవరు అంటే ప్రీతో మీరు హృదయంలో చూసుకోండి. ప్రపంచంలో వస్తువులు అయినా మీకు ప్రీతి అయ్యి ఉంటాయి. ప్రపంచంలో వ్యవహారాలు అన్నా ప్రీతి అయ్యుంటాయి. ఏ ప్రీతి అయినా ప్రాపంచిక సంబంధించిన ప్రీతే. కానీ ఈ రోజుకి కూడా మనం రాముడిని ఆరాధిస్తున్నాము. రాముడిని కృష్ణుడిని కూడా ఈ రోజుకి కూడా వాళ్ల నామం స్మరించటానికి ఒకటే కారణం. ఈ భూమి మీద ఏ వస్తువు మీదా రాముడికిగాని, కృష్ణుడికిగాని ప్రీతి లేదు. ఒక్క ధర్మం తప్ప. వాళ్ల హృదయంలో ధర్మం ఉంది. ధర్మం ఆ రూపం దాల్చింది. అందుకు ఈ రోజు వరకూ రాముడిని కృష్ణుడిని మనం ఆరాధిస్తున్నాము. వాళ్ల హృదయాన్ని మీరు కోసిచూస్తే అక్కడ ప్రాపంచికమైనది ఏదీ కనబడదు. పెట్రోమాక్స్ లైట్ పెట్టి చూసినా కృష్ణుడి హృదయంలో కానీ రాముడి హృదయంలో కానీ ప్రాపంచిక విషయాలు ఏమీ ఉండవు. ఒకసారి రమణభగవాన్ని అడిగారు. రాముడికి జ్ఞానం ఉందా కృష్ణుడికి జ్ఞానం ఉందా? అని. ఎవరి పేరు స్మరిస్తే మనకి జ్ఞానం కలుగుతోందో, వారు జ్ఞానం లేకుండా ఉంటారా? ఎవరి పేరైతే మనం స్మరిస్తున్నామో, ఆ పేరు స్మరించినంత మాత్రంచేత మనకి జ్ఞానం కలుగుతూ ఉంటే వాళ్ళు జ్ఞానం లేకుండా ఎలా ఉంటారు? వాళ్ల పేరు తలపెట్టుకుంటేనే మనకి జ్ఞానం వస్తోంది కదా. ఇంక వాళ్ళు జ్ఞానం లేకుండా

ఎలా ఉంటారు? అన్నారు.

పదజాలాన్ని చూసి ఏమీ కంగారు పడకండి. భక్తి భక్తి అంటే మీరేమి కంగారు పడక్కరలేదు. అది ప్రీతి! మీకు జున్ను అంటే బాగా ఇష్టం అనుకోండి, అదే ఇష్టం మీకు రాముడి మీదో, కృష్ణుడి మీదో, మీ గురువు మీదో, ఎవరో ఒకరిమీద మీకు ప్రీతి ఉంది అనుకోండి, దానినే భక్తి అంటారు. మీకు ప్రాపంచిక వస్తువుల మీద ఏదో ఒక వస్తువు మీద ప్రీతి ఉంది. కొంతమందికి కొత్త బట్టలు అంటే చాలా ఇష్టం. ఆ ప్రీతి రాముడి మీదో కృష్ణుడిమీదో ఉంటే చాలు. ఆ ప్రీతి భగవంతుడి మీద ఉంటే దానినే భక్తి అంటారు. అంతకంటే ఏమీ లేదు! ఇక్కడ కష్టమేమి లేదు కదండీ? మరెందుకు మీరు అంత కష్టపడి పోవటం బాధపడి పోవటం, కంగారు పడవలసిన పనేముంది?

మనకు అంతటా వర్షం ఎలాగైతే కురుస్తోందో, అలాగే భగవంతుడి అనుగ్రహం మనందరి మీద కురవాలంటే, ఒకటే వాక్యం ఉంది. మీరు ఎవరి మనస్సునీ కంగారుపెట్టకూడదు. ఇతరులు మిమ్మల్ని కంగారు పెడుతూవుంటే మీరు కంగారు పడకూడదు. అప్పుడు మీ మీద భగవంతుడి ప్రీతి కురుస్తుంది. భగవంతుడి యొక్క అనుగ్రహం కురుస్తుంది. మీరు ఎవరి మనస్సుని కంగారు పెట్టకూడదు, ఎవరైనా మిమ్మల్ని కంగారు పెడదామని ప్రయత్నం చేస్తే మీ మనస్సు కంగారు పడకూడదు. ఎవరైనా మిమ్మల్ని కంగారు పెడుతూ వుంటే మీరు కంగారు పడినా, మీమీద భగవంతుడికి ప్రీతి కలుగదు. మీరు ఎదుటివారిని కంగారు పెట్టినా మీమీద భగవంతుడికి ప్రీతి కలుగదు. ఇది మీరు జ్ఞాపకం ఉంచుకోండి.

ఎదుటివారి తప్పులు వెదుకుతూ మీరు రోజులు గడిపేస్తున్నారు అని భాగవతంలో చెప్పాడు. ఎదుటి వాళ్ళ తప్పులు వెదుకుతూ మీ రోజులను గడిపేసుకుంటున్నారు దానివలన మనకి కలసివచ్చేది ఏముంది? సూర్యనారాయణరాజు గారిలో, రామచంద్రరాజుగారిలో లేకపోతే పోస్ట్‌మాస్టారులో ఏదో దోషం ఉందని నేను చెపుతూ వుంటే దాని వల్ల నాకు కలసివచ్చేది ఏముంది? భగవంతుడు చెప్పేది మీకు కలసిరాని పనులు చెయ్యవద్దు అంటున్నాడు. మీకు కలసివచ్చే పనులే మిమ్మల్ని చేసుకోమని చెపుతున్నాడు భగవంతుడు. ఆధ్యాత్మికంగా మీకు కలసివచ్చే పనులే చేసుకోండి.

ఈ కష్టాలూ, సుఖాలూ; దుఃఖాలూ, బాధలూ; భారాలూ ప్రతీ జన్మలోనూ ఇలాగే వస్తూనే ఉంటాయి. కష్టాలు పోయిన తరువాత, దుఃఖాలు పోయిన తరువాత, ఈ రాగాలు

పోయిన తరువాత, ద్వేషాలు పోయిన తరువాత, ఇవన్నీ పోయిన తరువాత అప్పుడు ఆత్మని తెలుసుకోవటానికి ప్రయత్నం చేద్దాము అని అనుకోవటం ఎటువంటిది అంటే కెరటాలు తగ్గిన తరువాత సముద్రంలో స్నానం చేద్దాము అనుకోవటం వంటిది అని వివేకానంద చెప్పాడు. ఒకడు సముద్రం ఒడ్డున కూర్చుని కెరటాలు తగ్గిన తరువాత స్నానం చేద్దాం అనుకున్నాడట. కెరటాలు తగ్గుతాయా? కెరటాలు తగ్గనూ తగ్గవు, వీడు స్నానం చేసేదీ లేదు. కెరటాలు తగ్గిన తరువాత స్నానం చేద్దాము అనుకోవటం ఎంత మూర్ఖత్వమో మనకి కష్టాలు పోయిన తరువాత, ఎప్పుడో మంచి రోజులు వచ్చాక అప్పుడు భక్తిగా ఉందాం, అప్పుడు జ్ఞానంగా ఉందాము, ఇప్పుడు మనకి ఇంటివద్ద సుఖంగా లేదు, భవిష్యత్తులో ఎప్పుడో మంచిరోజులు వస్తాయి, ఆ వచ్చిన తరువాత అప్పుడే భక్తి చూసుకోవచ్చు అనుకోవటం లేకపోతే ఈ జన్మకి వదిలేద్దాము వచ్చే జన్మలో మనం చేసుకోవచ్చు అనుకోవటం అంతే మూర్ఖత్వం. పెళ్ళికొడుకు చాలా మంచివాడు, మీరు సంబంధం చెయ్యటానికి అనుమానించకండి, కానీ ఒకటే దోషం ఉంది పెళ్ళికొడుకులో, సంబంధం మాత్రం మానకండి అని చెప్పారు. ఏంటి దోషం? చదువు ఉంది, ఉద్యోగం ఉంది, ఆస్తి ఉంది, అందంగా ఉంటాడు, అన్నీ బాగానే ఉన్నాయి కానీ ఒకటే దోషం. ఆ దోషం ఏమిటి అంటే "వాడికి తోచదు, ఎదుటి వాడు చెపితే వినడు" అది ఒక్కటే, ఆస్తి ఉద్యోగం అన్నీ ఉన్నమాట నిజమే, అందంగా ఉంటాడు. వాడి సొంత బుర్రకి ఏమీ తోచదు, ఎదుటివాళ్ళు చెపితే వినడు. వాడిని మూర్ఖుడు అంటారు.

ప్రపంచంలో మనిషి దుష్టస్థితికి పోవటానికి మూర్ఖత్వం కారణం. మనం తెలివితక్కువ వాళ్ళతోటి పడగలం, తెలివైన వాళ్ళతోటి పడగలం, కానీ మూర్ఖులతోటి మటుకు పడలేము. మనిషి తెలివైన వాడు అయినా పరవాలేదు, తెలివితక్కువ వాడు అయినా పరవాలేదు. తెలివితక్కువ వాడైతే, వాడికి తెలియకపోతే మనం చెపితే వింటాడు, తెలివైన వాడికి మనం చెప్పక్కరలేదు, వాడికే తడుతుంది. కానీ మూర్ఖుడు, వాడి బుర్రకి తట్టదు, వాడికి తోచదు మనం చెపితే వినడు. అదే మూర్ఖత్వం. ఆ మూర్ఖుడికి చెడ్డ రోజులు కనిపెట్టుకొని ఉన్నాయి. భవిష్యత్తులో చెడ్డజన్మలకి ఈ మూర్ఖత్వం కారణం అవుతుంది. ఈ ఒక్క శరీరంతోటి అది నాశనం అవ్వదు.

ఇంద్రియాలు ముసలివి అయినా, శరీరం వడిలిపోయినా, శరీరం రాలిపోయినా, వాసనలు ముసలివి అవ్వవు, వాసనలు వాడిపోవు, వాసనలు రాలిపోవు. శరీరాలు ముసలివి అవ్వవచ్చు కానీ వాసనలు మటుకు ముసలివి అవ్వవు. శరీరాలు పువ్వులు వాడిపోయినట్లు

వాడిపోవచ్చు కానీ వాసనలు వాడిపోవు. శరీరాలు రాలిపోవచ్చును, కానీ వాసనలు మటుకు రాలిపోవు. వాసన ఎంతకాలం అయితే ఉందో, అంతకాలం సంకల్పం వస్తూనే ఉంటుంది. వాసన ఉన్నంతకాలం మీరెన్ని యోగాభ్యాసాలు చేసినా, ప్రాణాయామాలు చేసినా, ఎన్ని యాత్రలు చేసినా, సంకల్పం రాకుండా ఎవడూ ఆపుచెయ్యలేడు, ఆపుచెయ్యలేడు, ఆపుచెయ్యలేడు.

బాధలేని రోగం ప్రమాదమైనది, బాధ ఉన్న రోగం అంత ప్రమాదమైనది కాదు. మనకి రోగాలు వస్తూ ఉంటాయి, కొన్ని రోగాలకి బాధలు ఉంటాయి, కొన్ని రోగాలకి బాధలు ఉండవు. బాధ ఉంటే తొందరగా డాక్టరుగారి దగ్గరకి వెళ్ళిపోతాం ఏదో వైద్యం చేయించుకుంటాం. రోగం ఉన్నప్పటికీ బాధ లేకపోతే అశ్రద్ధ చేస్తాం. రక్తపోటు అలాంటిది. రక్తపోటు మనకి బాధ ఉండదు, అందుచేత అశ్రద్ధ చేసేస్తాం. రాగం అంతే, కామం అంతే. రోగం ఈ శరీరాన్నే తీసుకెళ్తుంది; రాగం, కామం అనేక జన్మలని తీసుకొస్తాయి. గడ్డిమేటు ఎంత పెద్దదైనా దాన్ని కాల్చేయటానికి ఒక చిన్న అగ్గిపుల్ల చాలు. మన హృదయంలో కోట్లాది సంస్కారాలు ఉన్నప్పటికీ, జ్ఞానం అనే ఒక్క మెరుపుకలిగిందా, చిన్న అగ్గిపుల్ల గడ్డిమేటుని ఎలా కాలుస్తుందో, అలాగే జ్ఞానమనేది కలగాలి కానీ హృదయంలో ఉన్న మొత్తం వాసనలు సంస్కారాలు అన్నీ కాలిపోతాయి. మనం వంట చేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ ఎక్కడో ఒకచోట మసి అంటుకోవటం తప్పదు అన్నాడు రామకృష్ణపరమహంస. అదేవిధంగా లోకంలో ఉన్నప్పుడుఎంత జాగ్రత్తగా ఉన్న ఏదో ఒక మసి అంటుకోవటం తప్పదు అన్నాడు. మీకు ఎదుటివాళ్ళలో ఎక్కడ ఏ దోషం కనిపిస్తున్నప్పటికీ, ఆ దోషం మీలో కూడా ఉందని గుర్తు. మీలో ఎంతోకొంత ఆ దోషం లేకపోతే ఎదుటివాళ్ళలో ఆ దోషం ఉన్నా మీకు కనపడదు.

మనం ఒక అరవై సంవత్సరాలో, డబ్బై సంవత్సరాలో ఈ లోకంలో ఉంటాం, తరువాత ఈ లోకాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోతాం. మన దేహాలు రాకముందు ఈ లోకం ఉంది, మనం దేహాలు విడిచిపెట్టిన తరువాత కూడా ఈ లోకం ఉంటుంది. మనం నిరంతరం లోకం గురించే ఆలోచిస్తే లోకానికి సంబంధించిన మనుషులుగా మాత్రమే మనం మిగిలిపోతే, మరి మనం పోయిన తరువాత ఈ లోకాన్ని ఎవరు మరమ్మత్తు చేస్తారు? ఈశ్వరుడా, లేకపోతే మన అహంకారమా? భాగవతంలో చెప్పినట్టు ఎదుటివాళ్ళలో ఉన్న దోషాలని చూస్తూ మీరు ఉంటే మీలో రజోగుణం పెరుగుతుంది. రజోగుణ లక్షణం ఏమిటంటే పాపాలు చేయించటం దాని పని, సత్వగుణం మోక్షానికి దారి చూపిస్తుంది. రజోగుణం తమోగుణం పాపాలు చేయిస్తాయి, అవి మనలో ఉన్న వివేకం పూర్తిగా చంపి శాశ్వతంగా

నరకంలోకి తీసుకుపోతాయి. మనకు ఇష్టం లేకపోయినా బలవంతంగా లాక్కుపోతాయి.

నేను మాటలు చెపుతున్నాను. ఈ మాటల బరువు మీలో ఎంత మందికి తెలుసు? నేను మాటలు చెప్పాలని మీరు అందరూ సరదా పడుతున్నారు, ఏవో నాలుగు మాటలు చెపుతున్నాను. ఈ మాటలకి బరువు ఎంతుందో మీరేం చూస్తున్నారు? ఒక్కోసారి కలలు కూడా మనకి పాఠాలు చెపుతాయి. ఎందుచేతనంటే జాగ్రదావస్థలో కంటే స్వప్నావస్థలో మనం మనస్సుకి దగ్గరగా ఉంటాం. ఒక స్వప్నంలో నేను ఇడ్లీ తింటున్నాను, నేను ఇడ్లీ తింటుంటే ఎవరో వచ్చి ఉప్మా వడ్డించారు. ఎవరో తెలియటంలేదు నాకు. నేను ఉప్మా మిమ్మల్ని అడగలేదు అంటున్నాను. ఉప్మా అడగలేదు, ఉప్మా అడగలేదు అని గింజుకుంటున్నావు ఇడ్లీలు మటుకు నువ్వు అడిగావా? అన్నారు. మరణించటం కూడా ఒక కల అని మీరు మర్చిపోకండి. అది దీర్ఘనిద్ర. మనకి ఒక్కోసారి రాత్రి పడుకున్నప్పుడు కల వస్తుంది, మళ్ళీ ఆ కల ఆగిపోతుంది. మళ్ళీ ఒక గంట అయిన తరువాత నిద్రలోనే ఇంకో కల వస్తుంది. మళ్ళీ ఆ కల ఆగిపోతుంది. మనకి ఒక రాత్రే రెండు మూడు కలలు వరుసగా వస్తాయి. అదేవిధంగా ఈ అజ్ఞానం అనే నిద్రలో ఈ జన్మ ఒక కల, రాబోయే జన్మ ఒక కల. ఇదంతా గాఢనిద్ర. ఈ జన్మ ఒక కల, రాబోయే జన్మ ఒక కల, ఆ తరువాత వచ్చే జన్మ ఒక కల. మొత్తం అన్నీ కలలే. కళ్ళు పొడుచుకున్నా కానరాని మహాచీకటిలోంచి, ఈ మహా అజ్ఞానంలోంచి, ఈ మహా మోహంలోంచి, ఈ మహా బంధంలోంచి, జీవుడిని బయటికి లాగగల శక్తి ఒక్క ఈశ్వరుడికే సాధ్యం, గురువుకే సాధ్యం. మీ చేతులతోటి ఈ అజ్ఞానాన్ని తీసుకోలేరు. ఎందుచేత? మీకు అజ్ఞానం అంటే చాలా ప్రియంగా ఉన్నప్పుడు మీరు అజ్ఞానాన్ని ఎలా తీసుకుంటారు? మనకి కావలసింది సుజ్ఞానం కాదు, మనం ప్రేమించేది అజ్ఞానాన్ని. మనం అజ్ఞానాన్ని ప్రేమిస్తూ ఉంటే ఇంక దానిని ఎలా పోగొట్టుకుంటాం? పోగొట్టుకోలేము, సాధ్యం కానే కాదు! అందుచేత ఈశ్వరానుగ్రహం ఉండాలి. మీ మనస్సులో ఉన్న అశుద్ధాన్ని తీసేసి, దానిని శుద్ధమనస్సుగా తయారుచెయ్యటానికి, ఆశక్తి ఒక భక్తికే ఉంది. రామకృష్ణ పరమహంసది శుద్ధమనస్సు. వివేకానందది శుద్ధమనస్సు. ఎందుచేత వాళ్ళకి శుద్ధమనస్సు వచ్చింది అంటే, వాళ్ళలో ఉన్న అశుద్ధం పోయింది. అలాగే మనలో ఉన్న అశుద్ధం పోతేనేగానీ మనకి శుద్ధమనస్సు రాదు. అది భక్తి వల్ల సాధ్యం.

కొన్ని లక్షలాది సంవత్సరాల నుంచి ఈ భూమి ఉంది, రాబోయే కొన్ని లక్షలాది సంవత్సరాలు ఈ భూమి ఉంటుంది, ఈ లక్షలాది సంవత్సరాలలో, ఈ యుగంలో నీ వయస్సు

ఎంత? యాభై ఏళ్ళు, అరవై ఏళ్ళు, డబ్బై ఏళ్ళు. వాట్ ఈజ్ మేన్స్ లైఫ్, కంపేర్డ్ టు ఎటర్నల్ లైఫ్. ఆత్మతోటి పోల్చుకుంటే, శాశ్వత జీవితంతో పోల్చుకుంటే, నీ వయస్సు ఎంత? పోనీ మహా బ్రతికితే నూరు సంవత్సరాలు బ్రతుకుతావు. ఈ భూమి యొక్క వయస్సుతోటి పోల్చుకుంటే, సూర్యుడి యొక్క వయస్సుతోటి పోల్చుకుంటే నీ వంద సంవత్సరాలు ఎంత? జీవితంలో సగం నిద్ర. ఈ వంద సంవత్సరాలలో నిద్రకే యాభై సంవత్సరాలు సరిపోతుంది. ఇంట్లో తగవులు, ఊళ్ళో తగవులతోటి ఇంకో పాతిక సంవత్సరాలు పోతుంది. ఎక్కడికక్కడ మీరు కూడా లెక్కలు కాగితం మీద వేసుకోండి. కాగితం పెన్సిల్ తీసుకుని లెక్కలు రాయండి. జమా ఖర్చులు వేసుకోండి. మీ జీవితం వంద సంవత్సరాలైతే అందులో యాభై సంవత్సరాలు నిద్రలో పోతోంది. ఇంకో పాతిక సంవత్సరాలు ఇంట్లో పేచీలు, ఇంట్లో రోగాలు వీటికి పోతోంది. ఇంకో పాతిక సంవత్సరాలు ఉంటే, వాటిని సద్వినియోగం చేద్దామంటే, ఎదుటివాళ్ళ గొడవల తోటి కాలక్షేపం అయిపోతుంది. ఇంక మోక్షం కోసం ఎప్పుడు ప్రయత్నం చేస్తారు? మోక్షాన్ని మీరు సాధించవద్దు, అసలు మోక్షం పొందాలనే శుభసంకల్పం ఎవరికైనా వచ్చిందా? మోక్షాన్ని మీరు సాధించవద్దండీ, అసలు మోక్షాన్ని సాధించాలనే శుభసంకల్పం మీలో ఎవరికైనా ఉందా?

ధ్యానం చేసేటప్పుడు, నిద్ర వచ్చేవాళ్ళు ఎవళ్ళూ కళ్ళు మూసుకోకండి. ధ్యానం చేసేటప్పుడు కళ్ళు మూసుకున్నా పరవాలేదు, కళ్ళు తెరచి ఉన్నా పరవాలేదు. అయితే నిద్ర వచ్చేవాళ్ళు మటుకు కళ్ళు మూసుకోకండి. నిద్ర కూడా యోగానికి భంగం. అసలు నిద్ర లేకుండా ఉండటం మంచిది కాదు, అతిగా నిద్రపోవటం కూడా మంచిది కాదు. అతిగా తినటం మంచిది కాదు, అసలు తిండి లేకుండా ఉండటం కూడా మంచిది కాదు. మీ వయస్సు ఎంత? మీరు తల్లి కడుపులోంచి బయటికి వచ్చాక అనేక రాత్రులు వెళ్ళిపోయాయి. మీకున్న డబ్బు అంతా ఖర్చు పెట్టి ఒక్క రాత్రిని వెనక్కి రప్పించండి! వెనక్కి రమ్మంటే వస్తుందా ఒక్క రాత్రి!

లోకంలో అనేక విద్యలు ఉన్నాయి, కానీ బ్రహ్మవిద్యని నేను ఆత్మవిద్యని నేను అని భగవంతుడు వాసుదేవస్వామి విభూతియోగంలో చెప్పాడు. ఒక బాగా చదువుకున్న ఆయన గోదావరి లాంటి నదిని దాటుతున్నాడు. ఆ పడవని ఒకడు గెంటుతున్నాడు. ఈలోపు ఉపద్రవమైన వర్షంతో కూడిన గాలి, అమాంతంగా సుడిగాలికింద వచ్చింది. ఆ పడవ అటూ ఇటూ ఊగిపోతోంది. మన జీవితాలు కూడా అలాగే ఉన్నాయి. ఏమయ్యో నీకు లెక్కలు ఏమైనా వచ్చునా , లెక్కలు బాగా చేస్తావా అని చదువుకున్న ఆయన పడవ

గెంటేవాడిని అడుగుతున్నాడు. వాడు నాకు లెక్కలు ఏమీ రావు అన్నాడట. పోనీ ఇంగ్లీషు వచ్చునా నీకు అంటే, ఇంగ్లీషురాదు అన్నాడట. సంగీతం పాటలు పడతావా అంటే పాటలూ రావు అన్నాడట. సైన్సు గురించి ఏమైనా తెలుసా అంటే ఏదీ తెలియదు అన్నాడు ఈ లోపల పడవ మునగటానికి సిద్ధం అయ్యింది. అప్పుడు అతను అన్నాడట, ఏమండీ నాకు మీరు చెప్పినవి ఏమీ రావు. కానీ ఇప్పుడు ఈ పడవ మునిగిపోతోంది మీకు ఈత వచ్చునా అన్నాడట. నాకు అన్నీ వచ్చును కానీ ఈత మటుకు రాదు అన్నాడట. అయితే పడవ మునిగిపోతోంది మీరు ఈ గోదావరిలో కొట్టుకుపోవచ్చు. నాకు ఈత వచ్చు, నేను ఒడ్డుకి వెళ్ళిపోతాను అన్నాడు. నదిని దాటాలంటే ఈత ఎటువంటిదో సంసారం అనే నదిని దాటటానికి ఈ ఆత్మవిద్య అటువంటిది. మిగతా ఎన్ని విద్యలు ఉన్నప్పటికీ ఈ పంతులుగారికి ఉన్నటువంటి విద్యలు వంటివే అవి. వాడికి లెక్కలు వచ్చిన మాట నిజమే కానీ ఇక్కడ ఈత రానివాడు రక్షించబడడు. వాడికి సైన్సు వచ్చిన మాట నిజమే, కానీ సైన్సుకి ఈతకి సంబంధం ఏమిటి? వాడు రక్షింపబడడు! అదేవిధంగా మీకు ఎన్ని విద్యలు వచ్చినప్పటికీ, ఎన్ని భోగాలు ఉన్నప్పటికీ, ఎన్ని ఐశ్వర్యాలు ఉన్నప్పటికీ, ఎన్ని కళలు ఉన్నప్పటికీ, మీకు ఆత్మవిద్య అనేటువంటి ఈత కనుక మీకు రాకపోతే, ఈ బ్రహ్మవిద్య అనే ఈత మీకు రాకపోతే, ఈ సంసారం అనే నదిలోంచి బయటకు రాలేరు రాలేరు! ఆత్మవిద్యలేని లోకవిద్యలు అన్నీ కూడా మంటలో పెట్టిన కట్టెలు వంటివి. మంటలో ఎన్ని కట్టెలు పెట్టినా సరే బూడిద అవుతాయి. ఆత్మవిద్య లేని లోకవిద్యలు అన్నీ అంతే. లోకవిద్యలు కూడా ఉండటం మంచిదే. కానీ ఆత్మవిద్య లేని లోకవిద్యల వలన ప్రయోజనం సున్నా, చివరకు బూడిద మిగులుతుంది.

రామకృష్ణపరమహంసకి సమానమైన వారు ఎవరూ ఈ లోకంలో లేరు అని మీరు అనుకోవద్దు. ఎవరైనా ఉంటే ఉండవచ్చును ఈ లోకంలో. కానీ వాళ్ళకి చెప్పే శక్తి లేకపోవచ్చు. ఈయనకి చెప్పే శక్తి ఉంది కాబట్టి లోకగురువు అయ్యాడు. తనని తాను చంపుకోవటానికి బ్లేడు చాలు, ఎదుటివాడిని చంపటానికి బ్లేడు సరిపోదు కత్తి ఉండాలి. వైరాగ్యం అనే కత్తి చేతిలో ఉండాలి. కత్తి ఏవిధంగా అయితే చెట్టుని నరుక్కుపోతుందో, ఈ వైరాగ్యం అనే కత్తి చేతిలో పెట్టుకొని అహంకారాన్ని నరకాలి. ప్రతీ సాధకుడి చేతిలో వైరాగ్యం అనే కత్తి ఉండాలి.

మహాత్ములు అందరూ జీవితాన్ని ఎంతో అరగదీసి సాధన చేసి సిద్ధిని పొందారు. మహాత్ములు అంటే ఏమీలేదు, గొప్ప ఆత్మ కలవారు. నావ నలుగురినో, ఐదుగురినో నది దాటిస్తుంది, ఓడ అయితే వేలాది మందిని దాటిస్తుంది. రమణస్వామి, రామకృష్ణుడు ఓడ

వంటివారు. నావ నీటిలో ప్రయాణం చేస్తుంది, ఓడా ప్రయాణం చేస్తుంది. కానీ తీసుకెళ్ళే జనాభాలో తేడా ఉంది రెండింటికీ.

భగవంతుడు మీరు అడిగితే అడిగిందే ఇస్తాడు, అగడకపోతే అన్నీ ఇస్తాడు. మీరు ఎంత చదువుకున్నప్పటికీ - వేమన అన్నాడు పంది బురదని మెచ్చును కానీ పన్నీరు మెచ్చునా? పందికి బురద అంటే ఇష్టం, పన్నీరు అంటే పందికి ఇష్టం ఉండదు. అందరూ మనుషులేనయా, అందులో పుణ్యపురుషులు వేరయా! మనకు కనబడటానికి అందరూ మనుషుల కిందే కనిపిస్తున్నారు కానీ ఆ మనుషులలో పుణ్యపురుషులు వేరయా!

చలంగారిని మొదటిలో భగవాన్ దగ్గరకి తీసుకెళ్ళినవారు దీక్షితులు గారు, ఆయన నరసాపురంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ చేసేవారు. చలంగారికి భక్తి అన్నా దేవుడు అన్నా ఇటువంటివి ఏమీ ఇష్టం ఉండేది కాదు. సరాదాగా చూసొద్దామని దసరా సెలవులలోనో, క్రిస్మస్ సెలవులలోనో తీసుకెళ్ళారు. చలంగారికి భక్తిలేదు భగవాన్ మీద, కానీ అక్కడికి వెళ్ళాక చలంగారికి భక్తి కలిగింది, అరుణాచలంలో స్థిరపడ్డారు. ఒకసారి అరుణాచలం నుంచి చలంగారు ఉత్తరం రాసారట దీక్షితులుగారికి , అరుణాచలం ఒకసారి వచ్చి చూసి వెళ్ళండి అని. చూడండి ఇదే ఆశ్చర్యం. తెలివిగలవాడే దీక్షితులుగారు కూడా. రామభక్తుడు ఆయన, శ్రీరామచంద్రమూర్తి అంటే ఎంతో ఇష్టం. చలంగారి ఉత్తరానికి సమాధానం ఏమని రాసాడంటే, భగవాన్ శరీరంతోటి ఇప్పుడు లేరు కదా, భగవాన్ సమాధి కదా అక్కడ ఉంది? సమాధి చూడటానికి కంగారుపడి రావలసిన పని ఏముంది? ఎప్పుడు పడితే అప్పడే చూడటానికి రావచ్చు. అక్కడ దేహం లేదు కదా ఉన్నది సమాధే కదా అని దీక్షితులు గారు వ్రాసారు. అప్పుడు చలంగారు తిరిగి సమాధానం రాసారు. సమాధి ఎప్పుడూ ఉంటుంది నిజమే కానీ మీదేహం ఉంటుందా? మీరు రాసిన ఉత్తరం నిజం, సమాధి ఎప్పుడూ ఉంటుంది అది కరక్టే కానీ మీ దేహం ఎంతకాలం ఉంటుంది? మీ దేహం ఎంతకాలం నిలబడుతుందో మీరు చూసుకోండి? అని వ్రాసారు.

మాకూ వచ్చి వినాలని ఉంటోంది కానీ... అంటారు. మాకూ వచ్చి వినాలని ఉంటోంది కానీ... అని ఆపుతారు అది మనం పూర్తి చేసుకోవాలా? వచ్చి వినటానికి వాడికి ఖాళీ లేదు మరి అన్నం తినటానికి ఎలా ఖాళీ ఉంటోంది వాడికి? అన్నం తినటం మానేయాలి కదా! స్నానం చేయటం మానేయాలి కదా! ముఖం కడుక్కోవడం కూడా మానెయ్యాలి. వాడికి ఖాళీ లేకపోతే మరి అన్నం ఎలా తింటున్నాడు ఖాళీ లేని మనిషి. అదెందుకు

ఆలోచించడు వాడు? ఇలా అన్నవాడికి నేను వ్యక్తిగతంగా సమాధానం ఏమీ చెప్పటం లేదు? మౌనంగానే ఊకొడుతున్నాను, కానీ మీ దగ్గర సమాధానం చెపుతున్నాను. ఈ మధ్యన ఒక భక్తుడు నా దగ్గర ఇలా అన్నాడు, నాకూ వచ్చి వినాలని ఉంటోంది కానీ.... అని ఆపుచేసాడు. ఆ తరువాత పూర్తిచేయట్లేదు వాడు. మరి అన్నం తినటానికి ఎలా ఖాళీగా ఉంది వాడికి? కాఫీ తాగటానికి ఖాళీ ఎలా ఉంది? రేపొద్దున చావు వస్తుందనుకోండి చచ్చిపోవటానికి ఖాళీ ఉండదా? నాకు పని ఉందయ్యా బోలెడు అంటే చావు ఆగుతుందా వాడికి. ఇక్కడికి రావటానికి ఆపుచేసుకొంటున్నాడు ఏదో ఉగ్గబెట్టుకొని, చావు వస్తే ఉగ్గబెట్టుకుంటాడా? పోనీ చావుదాకా వదిలేయండి, ఇప్పుడు భోజనం చేస్తున్నాడు కదా, అన్నం తినటానికి ఖాళీ ఎందుకు ఉంది వాడికి? ఇది అంతా వట్టిదే! లోపల శ్రద్ధ లేక చెప్పే మాటలు, వికారం మాటలు అవి. లోపల శ్రద్ధ లేక విశ్వాసం లేక చెప్పే మాటలు ఇవన్నీ. దండగ మాటలు, వాళ్ల కాలం ఖర్చు పెట్టుకోవటం, మన కాలం పాడుచేయటం. అనవసరం మాటలు, వ్యర్థమైన మాటలు. మీరు ఏ యూనివర్శిటీలో చదివినా, ఏ దేశంలో చదివినా, ఏ కాలేజీలో చదివినా, ఏ బళ్లో చదివినా ఒకటే నేర్చుకోవలసినది. చెడ్డని ఎలా విడిచిపెట్టాలో నేర్చుకోండి, మంచిని ఎలా చెయ్యాలో నేర్చుకోండి. అదే గౌతమబుద్ధుడు చెప్పేది. చెడ్డని ఎలా విడిచిపెట్టాలో నేర్చుకోండి. మంచిని ఎలా ఆచరించాలో నేర్చుకోండి. ఈ రెండు వాక్యాలు సదా జ్ఞాపకం ఉంచుకోండి.

నిద్రపోవటం మర్చిపోయినా పరవాలేదు కానీ బుద్ధిని మర్చిపోకండి. మన బుద్ధిని మనం మర్చిపోకూడదు. కొంతమంది దేహం అక్కడ ఉంటుంది, బుద్ధి అక్కడ ఉండదు. కొంతమంది దేహం అక్కడ ఉంటుంది, మనస్సు అక్కడ ఉండదు. అసలు బుద్ధి లేకుండా మనిషి ఉండడు కానీ తక్కువ బుద్ధి ఉంటుంది. అది అక్కడ లేనప్పుడు మాట్లాడేసి మళ్లీ బుద్ధి వచ్చాక మీరేమీ అనుకోకండి కంగారుపడి అలా మాట్లాడేసాము అంటారు. అంటే దేహం అక్కడ ఉంది, కానీ బుద్ధి అక్కడ లేదు.

ఒకమాట చెపుతాను మీరు మనస్సులో ఉంచుకోండి, సదా జ్ఞాపకం పెట్టుకోండి, అది మంత్రం క్రింద మననం చేయండి. మననం చేసేదే మంత్రం. అయితే ఆ శక్తి ఇప్పుడు మనకి లేదు, కానీ విషయం చెపుతున్నాను. శక్తి లేదు కదా, విషయం ఎందుకు చెప్పాలి మీరు, అని మీరు అడుగవచ్చు. అసలు విషయం విని ఉంటే భవిష్యత్తులో ఎప్పుడోకప్పుడు పని చేస్తుంది. పాము కరుస్తుంది అని చెపుతాను అనుకోండి మీకు

నేను, ఆ పాముని చూసినప్పుడు ఓహో కరుస్తుంది కదా మనం జాగ్రత్తగా ఉండాలి అని మీకు అర్థం అవుతుంది. తేలు కుడుతుంది అని చెప్పాను అనుకోండి, తేలుని చూసినప్పుడు ఓహో ఇది కుడుతుంది కదా మనం జాగ్రత్తగా ఉండాలి అని మీకు తెలుస్తుంది. వెంటనే ఆచరించ లేకపోయినా విషయం ఊరికే మనస్సులో పెట్టుకుంటే, ఎప్పుడైనా మీకు ఉపయోగ పడుతుంది. ఇప్పుడు, ప్రస్తుతం అవసరం లేదని ఉపయోగపడదు అనుకోకండి. కొంతమంది వాళ్ళ దగ్గర ఉన్న డబ్బు అవసరం లేని దానికి ఖర్చు పెట్టేస్తారు, అవసరమైనప్పుడు డబ్బులు ఉండవు. అవసరం లేని విషయాలకి ఖర్చు పెట్టేవాళ్ళ దగ్గర ఎవరి దగ్గరా అవసరం వచ్చినప్పుడు డబ్బు ఉండదు. ఎందుచేత, అవసరం లేని దానికి ఖర్చు పెట్టేస్తారు కదా! కొంతమందికి జేబులో డబ్బు ఉన్నప్పుడు డబ్బుల విలువ తెలియదు, జేబులో డబ్బు లేనప్పుడు, ఓహో డబ్బుకి ఇంత ప్రాముఖ్యత ఉందన్నమాట అనిపిస్తుంది. జేబులో డబ్బు లేనప్పుడే తెలుస్తుంది డబ్బు విలువ, ఉన్నప్పుడు తెలియదు. నేను చెప్పబోయే మాట కూడా అటువంటిదే. ఈ మాట విలువ ప్రస్తుతం మీకు తెలియకపోయినా, జేబులో డబ్బు ఉన్నప్పుడు, ఆ డబ్బు విలువ ఎలాగైతే కొంతమందికి తెలియదో, అలాగే ఇప్పుడు నేను మాటలు చెపుతున్నాను కానీ ఈ మాట మీరు విన్నంత మాత్రంచేత ఈ మాటలలో విలువ మీకు తెలియకపోయినప్పటికీ, అర్థం అవ్వకపోయినప్పటికీ భవిష్యత్తులో ఎప్పుడో జ్ఞాపకం రావటంకోసం చెపుతున్నాను. మోక్షాన్ని పొందటానికి మీరు చేసే ప్రయత్నంలో, సత్యాన్ని దర్శించటానికి మీరు చేసే ప్రయత్నంలో, ఏది అడ్డు వచ్చినా త్యాగం చెయ్యగల శక్తి ఉంటే వాడికి ఆత్మ దర్శనం అవుతుంది. సత్యాన్ని తెలుసుకునే ప్రయత్నంలో మోక్షాన్ని పొందటానికి మీరు చేసే ప్రయత్నంలో, ఆ జీవిత ప్రవాహంలో ఏది అడ్డు వచ్చినా సరే, దానిని పక్కకి గెంటుకొని ముందుకు వెళ్ళగల శక్తి మీకు ఉంటేనే జ్ఞానం కలుగుతుంది కానీ, చిన్న అడ్డు వస్తే కంగారుపడితే, అంతే వెనక్కి వెళ్తారు. ఏది అడ్డు వచ్చినా సరే మూవ్ ఫార్వర్డ్, మార్చ్ ఫార్వర్డ్, లుక్ ఫార్వర్డ్ అని చెపుతాడు వివేకానంద. నో నీడ్ ఆఫ్ లుకింగ్ బిహైండ్. వెనక్కి తిరిగి చూడకు. వెళ్ళు, ముందుకు వెళ్ళు, వెనుకకు చూడకు. నో నీడ్ ఆఫ్ లుకింగ్ బిహైండ్. వెనక్కి చూడవలసిన అవసరమే లేదు. గో ఫార్వర్డ్, మూవ్ ఫార్వర్డ్, మార్చ్ ఫార్వర్డ్, లుక్ ఫార్వర్డ్ అంటాడు.

గౌతమబుద్ధుడు ఇల్లు విడిచిపెట్టిన టైము రాత్రి. రాత్రి గృహం విడిచిపెట్టాడు ఎవరూ చూడరని. భగవాన్ పగలే గృహత్యాగం చేసారు. గౌతమబుద్ధుడు రాత్రి పరిత్యాగం చేసాడు. భగవాన్ పగలు చేసినా పరవాలేదు, సామాన్య సంసారం ఆయనది.

గౌతమబుద్ధుడు పగలు వెళ్లలేడు, ఆయన మహాచక్రవర్తి. అప్పుడు ఎయిర్ కండిషన్డ్ గదులు లేవు. తండ్రి, వేసవికాలం ఉండటానికి ఒక మేడ, శీతాకాలం ఉండటానికి ఒక మేడ, వర్షాకాలం ఉండటానికి ఒక మేడ కట్టించాడు గౌతమబుద్ధుడి కోసం. అంటే ఏ పనీ చెయ్యనక్కరలేదు, రాజ్యాన్ని కూడా పరిపాలించనక్కరలేదు, మనిషి కళ్లతోటి చూసుకోవటానికి ఎదురుగా ఉంటే చాలు. మనుషులలో ప్రభువు ఎటువంటి వాడో, చక్రవర్తి ఎటువంటివాడో, సాధకులలో జ్ఞాని అటువంటి వాడు. మనుషులకి ప్రభువు ఎటువంటివాడో, మనుషులకి చక్రవర్తి ఎటువంటివాడో, యోగాలలో జ్ఞానం అటువంటిది.

నన్ను క్షమించండి, నన్ను క్షమించండి, నన్ను క్షమించండి. ఒక్క జ్ఞానం తప్పించి మిగతావి అన్నీ నాకు దొమ్మరవిద్యలకింద కనిపిస్తాయి! ఈ మధ్యన ఇతరదేశాలలో కూడా ప్రాణాయామం అదీ చేయిస్తున్నారు. ప్రాణాయామం మంచిదే, ప్రాణాయామం వల్ల శరీరానికి ఆరోగ్యం కలుగుతుంది, శరీరం తేలిక పడుతుంది. అమెరికాలో రష్యాలో కూడా చాలామందికి ప్రాణాయామం చేస్తే రోగాలు తగ్గుతున్నాయట. వాళ్లు చేయిస్తున్నారు ఇప్పుడు ప్రాణాయామాలు. అయినప్పటికీ ఒక్క జ్ఞానం తప్పించి మిగతావి అన్నీ దొమ్మరవిద్యలకింద నాకు అనిపిస్తున్నాయి. ఈ మాట చెపుతున్నందుకు నన్ను క్షమించండి.

గౌతమబుద్ధుడు ఇల్లు విడిచిపెట్టే రాత్రి బుద్ధుడు ఒక గదిలో ఉన్నాడు, బుద్ధుడి భార్య, బుద్ధుడి కొడుకు ఒక గదిలో ఉన్నారు. తల్లీబిడ్డలు ఒక మంచం మీద నిద్రపోతున్నారు. ఆయన ప్రయాణం అవుతున్నాడు వెళ్లిపోదామని, ఈ ప్రపంచాన్ని లోకాన్ని ఉద్ధరించటానికి బయలుదేరుతున్నాడు. భార్యని చూడాలని అనిపించలేదు కానీ ఒక్కసారి కొడుకుని చూడాలి అనిపించింది. గౌతమబుద్ధుడి కొడుక్కి ఆయన ఇల్లు విడిచిపెట్టేటప్పుడు ఐదు నెలలో, ఆరు నెలలో ఉంటాయి అంతే. ఒక్కసారి కొడుకుని చూడాలనిపించింది. భార్య ఉన్న గదిలోకి వెళ్లాడు, భార్య గాఢంగా నిద్రపోతోంది, పిల్లవాడూ నిద్రపోతున్నాడు. ఒక్కసారి అలా చూసాడు అప్పుడు బుద్ధుడు అనుకుంటాడు, ఇది కూడా ఒక ఆటంకం, చూడాలన్న తలంపు కూడా ఒక ఆటంకమే కదా! తలంపు వచ్చింది, ఊరికే జస్ట్ అలా కళ్లతోటి చూసాడు, ఇది కూడా ఆటంకమే. తలుపు దగ్గరకు వేసి వెనక్కి వచ్చేసాడు, రాజ్యాన్ని విడిచిపెట్టి వెళ్లాడు. ఒకవేళ గౌతమబుద్ధుడి భార్య బాధపడవచ్చు, గౌతమబుద్ధుడి తండ్రి బాధపడవచ్చు, గౌతమబుద్ధుడి కుటుంబం బాధపడవచ్చు, ఆయన ఈ ప్రపంచాన్ని ఉద్ధరించటానికి వెళ్లాడు.

మహాత్ములకి కూడా ఇంట్లో వాళ్ల నుంచి గౌరవం ఉండదు. అవతారపురుషుడైన రాముడిని సీతాదేవి లాంటి అగ్నిహోత్రంలాంటి స్త్రీ కూడా సడన్‌గా ఒక పొరపాటు మాట

విడిచిపెట్టింది. రాముడు సీతతో ఏమన్నాడు అంటే నువ్వు స్త్రీవి, అక్కడ అడవిలో క్రింద పడుకోవాలి, మంచం, దిండు పరుపు ఉండవు, నువ్వు రావద్దు, ఎందుకు అనవసరంగా ఇబ్బంది పడటం. కైక అడివికి నన్ను వెళ్ళమంది కానీ నిన్ను వెళ్ళమనలేదు కదా! అందుచేత నువ్వు నాకూడా రావద్దు అన్నాడు రాముడు. రాముడు ఎంతటి వాడో ఆవిడకి తెలుసు. ఆ దేహప్రారబ్ధంలో ఏదైనా తేడా ఉంటే ఎంత మహాత్ముడికి అయినా సరే ఒక్కోసారి చెడ్డమాట జారుతుంది. సీతాదేవి అంటే సామాన్యమా! ఆవిడ పరాశక్తి, లక్ష్మీదేవి అవతారం. ఒక రాజుకి కూతురు, ఒక రాజుకి కోడలు, భగవంతుడికి భార్య. సీత రాముడితో ఏమంది అంటే.... పైకి పురుషుడిగానే కనపిస్తున్నావు కానీ, లోపల నీవన్నీ స్త్రీ లక్షణాలు అంది రాముడిని. లోపల స్వభావం స్త్రీ స్వభావమే, ఊరికే పైకి పురుషుడి వేషం కానీ, స్త్రీ గుణాలే, అని సడన్‌గా మాట అనేసింది. సీతాదేవి నోటివెంట ఈ మాట వచ్చినా అది యాక్సిడెంట్, ప్రమాదవశాత్తు వచ్చిన మాట.

మీలో ఎవరైనా జ్ఞానం సంపాదించాలని హృదయపూర్వకంగా కోరుకున్నట్టయితే, నిండు మనస్సుతోటి, హృదయపూర్వకంగా మీరు కోరుకున్నట్టయితే, మీ శక్తిని మీ యుక్తిని, మొత్తం మీకున్న సర్వస్వం జ్ఞానం సంపాదించటం కోసం ధారపొయ్యాలని మీరు అనుకుంటే ముందు మీ ఇంట్లో వాళ్ళే మీకు విరోధులు అవుతారు. అది మటుకు మీరు జాగ్రత్తగా ఆలోచించుకోండి. ఎన్ని కష్టమైన మాటలు చెప్పవలసి వస్తోంది, బాధాకరం! ఇన్ని మాటలు ఎందుకు? రాముడిని పూజించుకోండి, కృష్ణుడిని పూజించుకోండి అని చెప్పి వెళ్ళిపోమని చెప్పక, ఈ మాటలతో ఎందుకు మిమ్మల్ని బాధ పెట్టటం? నాలుగు మాటలు ముక్తసరిగా మాట్లాడి, మీరు బాగున్నారా అని చుట్టాలు కలుసుకున్నప్పడు మాట్లాడుకుంటారు చూడండి, అలా నాలుగు మాటలు మీకు చెప్పి పంపేయక ఎందుకు ఈ మాటలు అన్నీ నేను చెప్పటం? శుక్రవారం లక్ష్మీదేవికి పూజ చేసుకోండి అని చెప్పి మిమ్మల్ని పంపేయాలి కానీ, ఈ బాధ ఎందుకు? ఈ జన్మలోనే కాదు వచ్చే జన్మలలో అయినా సరే, భవిష్యత్తులో కూడా, నిజంగా కనుక మీరు జ్ఞానం కోసం తపించి, జ్ఞానం పొందాలి లేకపోతే ఆ ప్రయత్నంలో మరణించాలి అని, జ్ఞానాన్ని ఆరాధించటంకోసం మీలో ఎవరైతే నిరంతరం కృషి చేస్తున్నారో, ముందు మీ ఇంట్లో సభ్యులే మీకు విరోధులు అవుతారు. భవిష్యత్తులో ఎప్పడైనా మీరు ఈ ప్రయత్నం చేస్తే, అది మీ అనుభవానికి వస్తుంది, మీకు తెలియటం కోసం చెపుతున్నాను.

స్వాతంత్ర్యం పొందాలి స్వాతంత్ర్యం పొందాలి అంటే, దేనిలోంచి పొందాలి? సంకల్పం

లోంచి పొందాలి. సంకల్పం లోంచి మీరు స్వేచ్ఛ పొందకపోతే మీకు బాధ కలుగుతుంది. లోపల క్రోధంలోంచి, కామంలోంచి, దుష్టసంకల్పాల లోంచి మనస్సుని విడుదల చెయ్యకపోతే మీకు దారే కనబడదు. మిమ్మల్ని ఎవరైనా స్తంభానికి కట్టేసారు అనుకోండి, మీరు ఇంక ఎక్కడికి కదలగలరు. స్తంభానికి మిమ్మల్ని కట్టేసారు అనుకోండి, మీరు కదలలేరు కదా! అదేవిధంగా మీ మనస్సుని కామక్రోధాలు, రాగద్వేషాలకి కట్టేస్తే మనస్సుకి స్వేచ్ఛ ఏది? మనస్సు ఎక్కడికి ప్రయాణం చేస్తుంది?

సోక్రటీస్ భార్య ఒకరోజు సోక్రటీస్‌ని గంటల తరబడి తిట్టింది. ఎంత తిట్టినా ఆయన మాట్లాడలేదు. ఆవిడకి ఇంకా పౌరుషం వచ్చింది. నువ్వు ఎంత అంటే నువ్వు ఎంత అని ఈయన కూడా అనివుంటే ఆవిడ కోపం చల్లారిపోయి వుండేది. ఈయన మరీ మౌనం. లోకం కాలిపోతున్నా ఆ మౌనం చెదరదు. ఈ యావత్తు సృష్టి, ఈ లోకమే కాదు, పరలోకాలు కూడా ఒక్కసారి అంటుకొని కాలి బూడిద అయిపోతున్నా ఆ మౌనం చెదరదు. కదలడు, మెదలడు ఆ మనిషి! అదీ మౌనం అంటే! శరణాగతి లేని వాడికి మౌనం కుదరనే కుదరదు. సంకల్పాలు నీ మనస్సులో పుడుతూ ఉంటే నీకు శరణాగతి లేనట్టే. లోపల చిన్న సంకల్పం అయినా మీ మనస్సులోంచి పుడుతోంది అంటే మీకు శరణాగతి లేనట్టే. గంటలు తరబడి తిట్టింది సోక్రటీస్‌ని. ఇంక అప్పుడు భరించలేకపోయింది. బుడగ చూడండి ఒక్కసారి పేలిపోతుంది. ఎన్ని తిట్టినా వాడు మాట్లాడటం లేదని, ఇంట్లో కుండలో నీళ్ళు ఉంటే, ఆ నీళ్ళ కుండని తెచ్చి సోక్రటీస్ బుర్రమీద వేసి కొట్టింది. అప్పుడు అన్నాడు సోక్రటీస్, ఇప్పటివరకూ ఉరిమింది, ఇప్పుడు వర్షం కురిసింది. మబ్బు వేసి ఉరిమిన తరువాత వర్షం వస్తుంది. అలాగ ఇప్పటివరకూ ఉరుములు ఉరిమాయి ఇప్పుడు వర్షం కురిసింది అన్నాడు.

సోక్రటీస్ స్నేహితుడు ఒకడు ఆయనతో మీ భార్య మిమ్మల్ని ఎటువంటి మాటలు అందో అన్నాడు. "అలాకాదు, నాకు లోపల ఇంకా క్రోధం ఉందో లేదో పరీక్షించటానికి ఆ రూపం తీసుకొచ్చి ఇక్కడ పెట్టాడు ఈశ్వరుడు. ఈ మనుషులు లేకపోతే నా అహంకారం ఎలా కరుగుతుంది?" అన్నాడు సోక్రటీస్. ఒక కంసుడు లేకపోతే కృష్ణుడి గొప్పతనం మీకు తెలియదు. ఎప్పుడూ కూడా మంచి ప్రక్కన చెడ్డ కూడా ఉంటుంది. ఎందుకు చెడ్డ సృష్టిలో? మంచి యొక్క లోతు ఎంత ఉందో, గొప్పతనం ఎంత ఉందో, మనకి తెలియటం కోసం. వాళ్ళకి అది ఒకరకంగా పరీక్ష. అశుద్ధ మనస్సులోనే సంకల్పం పుడుతుంది. ఏ రకమైన సంకల్పం వచ్చినా లోపల అశుద్ధమైన మనస్సు ఉన్నట్టే.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| ఆగష్టు | 9 | మధ్యాహ్నం గం॥ 2-00లకు అమలాపురం మాష్టారి ప్రవచనం |
| ఆగష్టు | 23 | శ్రీకృష్ణాష్టమి - మధ్యాహ్నం గం॥ 2-00లకు హైదరాబాద్ అరుణగారి ప్రవచనం |
| సెప్టెంబర్ | 1 | మధ్యాహ్నం గం॥ 2-00లకు భీమవరం రాముగారి ప్రవచనం |
| సెప్టెంబర్ | 23 | **సద్గురు శ్రీ నాన్నగారి జయంతి**<br>ఉదయం గం॥ 6-00లకు పారాయణ<br>ఉదయం గం॥ 7-00లకు అల్పాహారం<br>ఉదయం గం॥ 8-00లకు పూజాకార్యక్రమములు<br>ఉదయం గం॥ 9-00లకు భక్తుల ప్రవచనములు<br>ఉదయం గం॥ 11-00లకు అన్న ప్రసాదం<br>మధ్యాహ్నం గం॥ 1-00లకు భక్తుల ప్రవచనములు |

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**ఈ సంచికతో మీ చందా గడువు ముగుస్తున్నది.**

**చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేస్తున్నాము. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వతచందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు

**సంవత్సర చందా** రు॥ **150**/-లు

# శ్రీకృష్ణాష్టమి

ప్రతి సంవత్సరం, శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథిని శ్రీకృష్ణాష్టమిగా జరుపుకోవడం మన సంప్రదాయంగా వస్తోంది. శ్రీకృష్ణాష్టమి హృదయానికి సంబంధించిన పండుగరోజు. సకల చరాచర సృష్టికి ఆధారమైన అఖండ చైతన్యమే, ఒక అద్భుత బాలుడిగా రూపుధరించిన రోజు. దేవకి వసుదేవులకు జన్మించినట్లుగా కనబడి, యశోదానందుల ఇంట్లో పెరిగిన శ్రీకృష్ణపరమాత్మ, ద్వాపరయుగం చివరి కాలంలో, సుమారు 125 సంవత్సరములు ఈ భూమిమీద సంచరించినట్లు చెప్పబడుతోంది. 'కృష్ణ' శబ్దం ఎంతో మధురమైనది, కారణం ఆయనది ఆనందతత్వం, నిర్గుణతత్వం. జీవకోటిని అనుగ్రహించుట కొరకు, ధర్మసంస్థాపన, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, శాంతిస్థాపన, లోకకల్యాణము నిమిత్తము స్వయంగా పరమాత్మ ఈ భూమి మీద అవతరించాడు. శ్రీకృష్ణుడు ఈ భూమిమీద అవతరించినప్పడు విభిన్నపాత్రలు పోషించాడు. అర్జునుడిని నిమిత్తముగా చేసుకొని ఉపనిషత్తుల సారమైన భగవద్గీత ద్వారా దేశ, కాల, కార్య, కారణాలకు అతీతమైన దివ్యజ్ఞానబోధను మానవాళికి అందించి జగద్గురువయ్యాడు. గంగాజలం శరీరాన్ని శుద్ధిచేస్తే, కృష్ణుని బోధ మనస్సుని శుద్ధి చేస్తుంది. శ్రీకృష్ణపరమాత్మ యొక్క ప్రతీమాట, ప్రతీచర్య మానవాళికి మహత్తరమైన సందేశముగా నిలిచాయి. కృష్ణుడు ఒకమాట మాట్లాడినా, ఒక పనిచేసినా అవి మానవుడిని దేహాత్మబుద్ధినుండి విడుదల చెయ్యటానికి ఉద్ధేశించినవే! కాబట్టి మనము పరమాత్మను ప్రమాణముగా పెట్టుకొని జీవించాలి. అందరి హృదయాలలోనూ అంతర్యామిగా ఉండి, జీవకోటిని వారి వారి ప్రారబ్దానుసారం నియమిస్తున్నాను అని పరమాత్మ చెబుతున్నాడు, అది మనకు అర్థం అవ్వాలంటే బుద్ధి సూక్ష్మత, తపస్సు, ఆయన అనుగ్రహము అవసరము. లీలాపురుషోత్తముడు, యోగీశ్వరుడు, జగద్గురువు, జ్ఞాని, అచ్యుతుడు, పూర్ణభగవంతుడు అయిన కృష్ణపరమాత్మతో మనకు ఉన్న సత్య సంబంధమే భక్తి. జగద్గురువైన శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహం నిరంతరం మనమీద వర్షించాలని వేడుకుందాం!

(ది॥ 23-08-2019 శ్రీకృష్ణాష్టమి సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**